7

సాక్షి అనంతపురం

బుధవారం। 20। నవంబర్। 2024



చీనీ టన్ను రూ.37,160

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37,160 పలికాయి.



కిలో టమాట రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.16 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

35.2°/ 19.4°

జిల్లా పరిధిలో మంగళవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆగని సర్కారు వేధింపులు

- సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ నరేంద్రనాథ్ రెడ్డిపై కేసు



గార్లదిన్నె: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి సర్కారు వేధింపులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పాలనా వైఫల్యాలపై పెట్టిన విమర్శలను సానుకూలంగా స్వీకరించి, లోటుపాట్లను అధిగమించాల్సింది పోయి.. ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయించి భయభ్రాంతులకు గురి చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ నరేంద్రనాథ్‌రెడ్డిపై గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేశారు. అనుచిత పోస్టులు పెట్టారంటూ టీడీపీ నాయకులు చేసిన ఫిర్యాదుపై ఆగమేఘాలపై స్పందించి అనంతపురంలో నివాసముంటున్న నరేంద్రనాథ్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ కౌలుట్లయ్య ఆధ్వర్యంలో శింగనమల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ పేరుతో స్టేషన్‌లోనే ఉంచుకున్నారు. భావప్రకటన స్వేచ్ఛపై దమనకాండ సాగుతోందని వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

సర్వేకు సహకరించండి

అనంతపురం రూరల్: ప్రభుత్వం చేపడుతున్న ఎన్‌పీసీఐ (బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్) సర్వేకు జిల్లావాసులు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఆధార్ లింక్ చేయించుకుంటే పలు పథకాలకు అర్హులవుతారన్నారు. విపత్తులు సంభవించి నష్టపోయిన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిహారం చెల్లించడానికి వీలవుతుందన్నారు. ఇంట్లో ఎంతమంది ఉన్నారు, ఏ ప్రాంతంలో ఉన్నారనే వివరాలతో పాటు ఇంటి నంబర్, ఫొటో అప్‌లోడ్ చేస్తారన్నారు.

నేడు హెచ్‌ఎం పదోన్నతుల కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్ బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అనంతపురం కార్పొరేషన్ సంస్థ ఒక యూనిట్‌గా, తక్కిన ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీలు ఒక యూనిట్‌గా పదోన్నతులు చేపట్టనున్నారు. ఇప్పటికే తుది సీనియార్టీ జాబితాను విడుదల చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. సర్వీస్ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా స్థానాలను భర్తీ చేయనున్నారు.

13 పోస్టుల భర్తీ..

6 గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులతో పాటు 7 ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయనున్నారు. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో మూడు గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులు, రెండు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీ ఉన్నాయి. మునిసిపాలిటీలకు సంబంధించి రాయదుర్గంలో రెండు, గుంతకల్లులో ఒక గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టు ఖాళీ ఉండగా, తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు, కదిరి, ధర్మవరం మునిసిపాలిటీల్లో ఒక్కో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టు ఖాళీగా ఉంది.

‘అపార్’పై ప్రత్యేక దృష్టి




మాట్లాడుతున్న ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ‘అపార్’ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపాళ్లను ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జరిగిన జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అపార్ నంబర్ జనరేట్ చేయడంలో ప్రైవేట్ కళాశాలలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా ఆధారంగా పేరు సరి చేయాలన్నారు. పుట్టిన రోజు తేదీలో తప్పులున్నట్లయితే నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్ పొంది లేట్ రిజిస్ట్రేషన్ బర్త్ సర్టిఫికెట్ ద్వారా మార్పులు చేయాలన్నారు. ఈ ప్రక్రియను కలెక్టర్ విడుదల చేసిన పోస్టర్ ద్వారా వివరించారు. మార్చిలో జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫీజు ఈ నెల 21లోపు చెల్లించాలన్నారు. 22 నుంచి రూ.వెయ్యి అపరాధ రుసుంతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ఏపీఓ నారాయణస్వామి, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, సోషల్ వెల్ఫేర్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సరిహద్దులో సైకత చోరులు

- కూటమి నేతల ఇసుక దందా
- ఉచితం ముసుగులో అక్రమ రవాణా
- ఇష్టారాజ్యంగా నదీ గర్భానికి తూట్లు
- భూగర్భజలాలు అడుగంటి రైతన్నలకు తీరని వేదన



- హిర్దేహాళ్ గేట్ సమీపాన ఓ ఫ్యాక్టరీ పరిసరాల్లో అక్రమార్కులు డంప్ చేసిన ఇసుక ఇది. పలువురు స్థానికులు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో ఈ విషయం వెలుగు చూసింది. ఇదొక్కటే కాదు రాయదుర్గం–కర్ణాటక సరిహద్దులోని ప్రతి గ్రామం వద్ద ఇలాంటి డంప్‌లు ఉన్నట్లు తెలిసింది.



- డీ. హీరేహాళ్ మండలం కల్యం సమీపాన అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను రెండు రోజుల క్రితం అధికారులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారంతో రెవెన్యూ, పోలీస్, మైన్స్ అండ్ జియాలజీ అధికారులు దాడులు చేపట్టి 42 క్యూబిక్ మీటర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. బాదనహాళ్ వద్ద హగరి నది నుంచి అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా తరలించి కుప్పలుగా చేసినట్లు గుర్తించారు.

రాయదుర్గం: కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో ఇసుక మాఫియా ఆగడాలు కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిందే తడవుగా అధికార పార్టీ నాయకులు ఇసుక అక్రమ వ్యాపారం ప్రారంభించారు. అధికారులు దాడులు చేస్తున్నా ఆగడం లేదు. ఒక ప్రాంతంలో చర్యలు తీసుకుంటే వెంటనే మరో ప్రాంతంలోకి మకాం మారుస్తున్నారు. సహజ వనరుల్ని చెరబట్టి దొరికినకాడికి దోచుకుంటున్నారు. ఉచిత ఇసుక పాలసీ పేరిట తమ జేబులు నింపుకుంటున్నారు.

రాత్రికి రాత్రే తరలించేస్తారు..

రాయదుర్గం నియోజకవర్గంలోని వేదావతి హగరి నదితో పాటు వాగులు, వంకలు, అటవీ ప్రాంతాల్లో లభించే ఇసుకను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలం జుంజురంపల్లి, గుండ్లపల్లి, వేపరాళ్ల, కణేకల్లు మండలం రచ్చుమర్రి, కళేకుర్తి, బిదురుకుంతం, మాల్యం, బొమ్మనహాళ్ మండలం ఏలంజి, లింగదహాళ్, కొలగానహళ్లి, ఉద్దేహాళ్, బండూరు, కల్లుదేవనహళ్లి, బొల్లనగుడ్డం, డీ హీరేహాళ్ మండలం బాదనహాళ్, నాగలాపురం, తిమ్మలాపురం ప్రాంతాల్లో లభించే నాణ్యమైన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా సరిహద్దులకు తరలించి డంప్‌లుగా పేర్చుతున్నారు. రాత్రి వేళ బళ్లారి, బెంగళూరు, చెళ్లకెర తదితర ప్రాంతాలకు తోలుతున్నారు. టిప్పర్ ఇసుకను రూ.70 వేల నుంచి రూ.లక్ష దాకా విక్రయిస్తూ నిత్యం రూ.లక్షల్లో వెనకేసుకుంటున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి నిత్యం వంద ట్రిప్పుల దాకా ఇసుక తరలిపోతున్నట్లు తెలుస్తోంది.

‘సెబ్’ రద్దుతో అక్రమాలకు తెర..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చారు. అక్రమ మద్యం, ఇసుక, గంజాయి కట్టడికి చర్యలు చేపట్టారు. సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేకంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమార్కుల ఆట కట్టించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే ‘సెబ్’ను రద్దు చేసింది. దీంతో అక్రమాలు మళ్లీ జడలు విప్పుకున్నాయి. ఈ క్రమంలో విలువైన ప్రకృతి సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. భూగర్భ జలాలు అడుగంటి పోకముందే అక్రమార్కులకు ముకుతాడు వేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుకను ప్రజా అవసరాలకు మాత్రమే ఉచితంగా వినియోగించాలి. దాని ముసుగులో ఎక్కడైనా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు చేపడతాం. సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచుతాం. కల్యం వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేయించాం. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, మైనింగ్ డీడీ, అనంతపురం

గురుకులాల్లో టీచరు పోస్టులకు దరఖాస్తులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల్లో ఖాళీగా ఉన్న టీచరు పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 10 గంటలకు అనంతపురం రూరల్ మండలం కురుగుంట గురుకుల పాఠశాలలో జరిగే డెమోకు హాజరుకావాలని గురుకులాల సమన్వయ అధికారి ఉదయశ్రీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. బాలికల పాఠశాలలకు మహిళలను మాత్రమే ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు.

ఖాళీల వివరాలు ఇలా...

తిమ్మాపురం బాలికల పాఠశాలలో టీజీటీ బీఎస్, పీజీటీ సోషల్, ఉరవకొండ బాలికల పాఠశాలలో జేఎల్ ఇంగ్లిష్, కురుగుంట బాలికల పాఠశాలలో జేఎల్ ఇంగ్లిష్, పీడీ, అమరాపురం బాలికల పాఠశాలలో టీజీటీ పీఎస్, టీజీటీ హిందీ, పీజీటీ ఇంగ్లిష్, గుత్తి బాలికల పాఠశాలలో జేఎల్ కెమిస్ట్రీ, జేఎల్ ఇంగ్లిష్, హిందూపురం బాలుర పాఠశాలలో టీజీటీ పీఎస్, హిందూపురం బాలికల పాఠశాలలో టీజీటీ పీఎస్.

ఇవీ విద్యార్హతలు

జేఎల్ పోస్టులకు పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, పీజీటీ పోస్టులకు పీజీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్, టీజీటీ పోస్టులకు డిగ్రీ, బీఈడీ, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్ (టీజీటీ హిందీకి డిగ్రీతో పాటు పీజీ ఉండాలి), పీఈటీ పోస్టులకు బీపీఎడ్, టెట్ క్వాలిఫై సర్టిఫికెట్ ఉండాలి.

రైతు రుణాలు రీషెడ్యూల్ చేయండి

- కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం సిటీ: జిల్లాలో ఏడు మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించిన నేపథ్యంలో ఆయా మండలాల్లోని రైతుల పంట రుణాలు రీషెడ్యూల్ చేసి ఆదుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ బ్యాంకర్లకు సూచించారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ క్యాంపస్‌లో ఉన్న డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా సంప్రదింపుల కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలు తిరిగి చెల్లించకపోయినా రీషెడ్యూల్ చేసి కొత్తగా మంజూరు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాలు మంజూరు చేసి నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. మెప్మా కింద ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీకి సంబంధించి జిల్లాకు 2,010 లింకేజ్ చేయాలని లక్ష్యం విధించగా 1,441 లింకేజ్ చేశారన్నారు. ఈ ఏడాది కేటాయించిన లక్ష్యానికి మించి మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్టాండప్ ఇండియా పథకం కింద గత ఏడాది 30 శాతం, ఈ ఏడాది ఇప్పటి వరకు 40 శాతం మాత్రమే రుణాలు మంజూరు చేశారని, అర్హులైన అందరికీ రుణాలు ఇవ్వాలని సూచించారు. ఎల్‌డీఎం, మెప్మా పీడీ, డీఆర్‌డీఏ పీడీలు బ్యాంకర్లతో ఏడు రోజుల్లోగా సమావేశాలు నిర్వహించి లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. హౌసింగ్ కింద ఇళ్లు నిర్మించుకునే స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 వేల చొప్పున రుణం అందజేయాలన్నారు. జిల్లాలోని 577 పంచాయతీల్లోనూ ప్రభుత్వ పథకాలు వంద శాతం అమలు కావాలని స్పష్టం చేశారు. అర్హులకు రుణాలు అందించడంలో ప్రతిభ కనబరచిన బ్యాంకర్లు, ఎల్‌డీఎంను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, ఎల్‌డీఎం నరసింగరావు, నాబార్డు ఏజీఎం అనూరాధ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, జిల్లా పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ శ్రీధర్, ఫిషరీస్ డీడీ శ్రీనివాసనాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, డీపీఓ నాగరాజు నాయుడు, మెప్మా పీడీ విశ్వజ్యోతి, వివిధ బ్యాంకుల సీఈఓలు, మేనేజర్లు పాల్గొన్నారు.

‘ఓడీఎఫ్’ జిల్లాగా తీర్చిదిద్దుదాం

అనంతపురం అర్బన్: జిల్లాను ఓడీఎఫ్ (బహిరంగ మల విసర్జన రహిత)గా తీర్చిదిద్దేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ‘మన మరుగుదొడ్డి– మన గౌరవం’ నినాదంతో డిసెంబరు 10వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా నీరు, పారిశుధ్య కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశుభ్రత అంశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. జిల్లాలో మరుగుదొడ్ల మరమ్మతుల కార్యాచరణను నిర్వహించడం, వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల సుందరీకరణ, పారిశుధ్య వీరులకు సన్మానం, తదితర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మరుగుదొడ్లను వినియోగించుకునేలా ప్రజలను చైతన్యపర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పాఠశాల్లలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, డ్వామా, వైద్య, విద్యాశాఖల అధికారులు చురుగ్గా పనిచేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో చేరిన ఉద్యోగులు

- ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దని ‘తమ్ముళ్ల’కు అధికారుల చురకలు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: ఉత్కంఠకు తెర పడింది. ఆ ఉద్యోగులకు ఊరట లభించింది. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి మెరిట్ కమ్ రోస్టర్ ద్వారా ఎంపిక చేసిన ఉద్యోగులను ఉరవకొండ మోడల్ స్కూల్‌లో చేర్చుకోకుండా ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అనుచరులు అడ్డుకుంటూ బెదిరింపులకు దిగిన వైనంపై ‘సాక్షి’లో వరుస కథనాలు వెలువడ్డాయి. వార్డెన్ పోస్టుకు బంగి సునీత, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు మాదిగ రాజేశ్వరి ఎంపికయ్యారు. కలెక్టర్ జారీ చేసిన నియామక ఉత్తర్వులతో విధుల్లో చేరేందుకు ఈనెల 11న వెళ్లిన ఆ ఇద్దరు ఉద్యోగులను స్థానిక టీడీపీ చోటా నాయకులు అడ్డుకున్నారు. ఏకంగా మోడల్ స్కూల్‌లోకి వచ్చి ప్రిన్సిపాల్ ఎదుటే హెచ్చరించారు. నియామక పత్రాలు చింపేస్తామంటూ బెదిరించారు. దీంతో ఆ ఇద్దరు వెనుతిరిగారు. కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. ఈ క్రమంలో ఈనెల 13న ‘సాక్షి’లో ‘మా వారిని కాదని ఎలా ఇస్తారు?’ శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. అయినా ఏమాత్రం తగ్గని టీడీపీ నాయకులు అదేరోజు డీఈఓ కార్యాలయానికి వచ్చి సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజుకు తీవ్రస్థాయిలో వార్నింగ్ ఇచ్చి వెళ్లారు. వీరి బెదిరింపులపై 14న ‘సాక్షి’లో ‘తగ్గని తెలుగు తమ్ముళ్లు’ శీర్షికతో మరో కథనం వెలువడింది. ఈ కథనాలు జిల్లా వ్యాప్తంగా దుమారం రేపాయి. అధికారులపై ఒత్తిళ్లు పెరగడంతో ఆ మరుసటి రోజే పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌ను చేర్చుకున్నారు. వార్డెన్‌ను మాత్రం చేరనీయకుండా టీడీపీ నాయకులు మువ్వు తిప్పలు పెట్టారు. పోలీసులను ఆశ్రయించినా నిరాశే ఎదురైంది. ఈ క్రమంలో బాధితురాలు మరోమారు జిల్లా స్థాయి స్పందనకు వచ్చి జాయింట్ కలెక్టర్‌ను కలిసి విన్నవించగా.. మంగళవారం ‘సాక్షి’ ప్రధాన సంచికలో ‘ఉరవకొండలో అరాచకం’ శీర్షికతో మరో కథనం వెలువడింది. దీంతో స్పందించిన రాష్ట్ర అధికారులు డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీకి ఆదేశాలు జారీ చేశారు. జీసీడీఓ వాణీదేవిని రంగంలోకి దింపారు. ఆమె స్వయంగా ఉరవకొండ మోడల్ స్కూల్‌కు వెళ్లి బంగి సునీతను విధుల్లో చేర్చుకునేలా ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. అయితే ఈ సమయంలోనూ కొందరు టీడీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా సమస్య అవుతోందని, ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దంటూ జీసీడీఓ వారికి చురకలంటించి వార్డెన్‌ను చేర్చుకునేలా చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ పాపం.. వర్సిటీలకు శాపం

- ఎస్కేయూ, జేఎన్‌టీయూల్లో ఐదు నెలలుగా ఇన్‌చార్జ్‌ల పాలన
- అధికారంలోకి వచ్చీ రాగానే కక్షగట్టి రెగ్యులర్ వీసీలతో రాజీనామాలు
- ముందుచూపు లేకుండా సర్కారు తీసుకున్న నిర్ణయంతో నేడు చిక్కులు
- విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా త్వరితగతిన స్పందించాలని నిపుణుల సూచన



అనంతపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల వ్యవధిలోనే ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురం వీసీలను నిర్బంధంగా రాజీనామా చేయించారు. అప్పటి ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావును రాజీనామా చేయాలని అధికారికంగానే కోరారు. దీంతో తక్షణమే వారు రాజీనామా చేశారు. అనంతరం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ అనిత, జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావును నియమించారు.

ప్రభుత్వ ఘనకార్యంతో దుస్థితి..

గత ఐదు నెలలుగా ఇన్‌చార్జ్ వీసీలతోనే వర్సిటీల పాలన సాగిస్తున్నారు. వర్సిటీల్లో పూర్తి స్థాయి వీసీల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తుంది. కమిటీల్లో వర్సిటీ తరఫున నామినీ, యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్), రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక్కో నామినీ ప్రకారం ముగ్గురు సభ్యులు ఉంటారు. ఈ ముగ్గురు సమావేశమై, మూడు పేర్లను ప్రతిపాదిస్తారు. ఇందులో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సుల మేరకు గవర్నర్ నియమిస్తారు. కాగా, ఇప్పటికే వీసీల నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులను కూడా స్వీకరించింది. వాటిని స్క్రూటినీ చేసి సెర్చ్ కమిటీలను నియామకం చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో ఒకే సారి 16 యూనివర్సిటీల వీసీలతో ప్రభుత్వం రాజీనామా చేయించడంతో యూజీసీ నామినీ నియామకంలో ఇక్కట్లు ఎదురువుతున్నాయి. కమిషన్ నామినీలుగా అంతమందిని ఒకే దఫా నియామకం చేయాలంటే నిపుణుల కొరత ఉండడమే ఇందుకు కారణం. ముందుచూపు లేకుండా కూటమి ప్రభుత్వం చేసిన ఘనకార్యం వల్లే నేడు ఈ దుస్థితి తలెత్తిందని నిపుణులు చెబుతున్నారు.

లోకల్ రాజకీయాలు..

ఇన్‌చార్జ్ వీసీలుగా ఆయా వర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లనే నియమించడంతో రాజకీయాలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమకు వ్యతిరేకంగా ఉండే ప్రొఫెసర్లపై కక్ష సాధింపులకు దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయి వీసీలుగా ఇతర వర్సిటీలకు చెందిన వారిని నియమించడంతో అంతర్గత రాజకీయాలను పక్కనబెట్టి అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తారని విద్యావేత్తలు అంటున్నారు. ఏదిఏమైనా దీర్ఘకాలికంగా ఇన్‌చార్జ్ వీసీలతో పాలన సాగించడం వర్సిటీల పురోగతికి ఆటంకంగా మారుతోంది. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ఈ విషయంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నియామకం.. మరింత ఆలస్యం!

జేఎన్‌టీయూ, ఎస్కేయూలకు కొత్త వీసీల నియామక ప్రక్రియలో మరింత జాప్యం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మంగళవారం జేఎన్‌టీయూ పాలకమండలి సమావేశం జరగ్గా.. ‘వీసీ సెర్చ్ కమిటీ’లో వర్సిటీ నామినీకి సంబంధించిన అంశం ప్రస్తావించకపోవడం గమనార్హం. వాస్తవానికి నామినీ ఎంపికే ప్రధాన అంశంగా సమావేశం నిర్వహించినప్పటికీ ఆ విషయం కనీసం చర్చకు కూడా రాలేదు. ఇదే క్రమంలో తక్కిన అంశాలపై కూడా చర్చ జరగలేదు. దీంతో జేఎన్‌టీయూ వీసీ నియామకం మరింత ఆలస్యం కానుంది. ఇక.. బుధవారం జరిగే ఎస్కేయూ పాలకమండలి సమావేశంలోనూ ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, రెండు వర్సిటీల పాలకమండలి సమావేశాలూ మంగళవారం జరగాల్సి ఉన్నప్పటికీ ఎస్కేయూలో జమున అనే ఉద్యోగి మరణించడంతో మంగళవారం సెలవు ప్రకటించారు. దీంతో పాలకమండలి సమావేశం బుధవారం జరగనుంది.

సాయి కీర్తనం.. భవిష్యత్ నిర్దేశనం



సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటున్న జస్టిస్ సూరేపల్లి నంద

- ప్రశాంతి నిలయంలో ఘనంగా మహిళా దినోత్సవం



మేళతాళాలు వాయిస్తున్న అనంతపురం క్యాంపస్ విద్యార్థినులు

ప్రశాంతి నిలయం: అంతర్జాతీయ ఆధ్యాత్మిక ధామం ప్రశాంతి నిలయం సత్యసాయికీర్తనలతో ప్రతిధ్వనించింది. సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాల సందర్భంగా మంగళవారం సాయికుల్వంత్ సభా మందిరంలో మహిళా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థినుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం, సత్యసాయి ప్రైమరీ, అనంతపురం మహిళా క్యాంపస్‌కు చెందిన విద్యార్థినులు పూర్ణ కలశాలు చేతబూని మేళతాళాలు, బ్రాస్ బ్యాండ్‌తో సత్యసాయి యజుర్ మందిరం నుంచి సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధి వరకు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలతో సత్యసాయిని కీర్తిస్తూ స్వరాలు పలికించారు. మృదుమధురమైన సంగీతంతో అందరినీ ఆకట్టుకున్నారు. సత్యసాయి అనంతపురం మహిళా క్యాంపస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వరి పాటిల్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు సతీమణి హిమవాహినితో కలసి తెలంగాణ హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. డాక్టర్ రాజేశ్వరి పాటిల్ ప్రారంభోపన్యాసం చేశారు. మహిళాలోకం పట్ల సత్యసాయి చూపిన ఆదరణను వివరించారు.

భవిష్యత్ మహిళలదే

భవిష్యత్ అంతా మహిళల చేతుల్లోనే ఉంటుందని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద అన్నారు. మహిళా దినోత్సవంలో ఆమె కీలక ఉపన్యాసం చేశారు. మహిళలకు భవిష్యత్‌ను నిర్దేశించారు. మహిళలు ఇప్పటికే కుటుంబం, సమాజం, జాతి నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, పురుషులతో సమానంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ సత్తా చాటుతున్నారన్నారు. ప్రతి మహిళా తన సామర్థ్యాలపై నమ్మకంతో కష్టపడే తత్వాన్ని అలవర్చుకుని ఎంచుకున్న రంగంలో ముందుకు సాగితే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు.

అశాస్త్రీయం... తిరోగమనం

- విద్యాశాఖలో ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు
- తిరోగమన విధానాలంటూ ఉపాధ్యాయుల మండిపాటు
- పని వేళల పెంపు నిర్ణయం సరికాదని సూచన
- వింత పోకడలకు పోతే ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరికలు

అనంతపురం ఎడ్యుకేషన్: కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోనే విద్యాశాఖలో అశాస్త్రీయ నిర్ణయాలు తీసుకుంటూ తిరోగమన విధానాలకు శ్రీకారం చుడుతోందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. బోధనాసిబ్బందికి చట్టబద్ధంగా సంక్రమించిన క్యాజువల్ లీవ్‌ల మంజూరులో నిబంధనలు సృష్టించడం, హైస్కూల్ ప్లస్ స్కూళ్ల పని గంటలను పెంచడం, రెసిడెన్షియల్ శిక్షణ, ఉన్నత పాఠశాలల సమయాన్ని పెంచడం తదితర నిర్ణయాలను ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



ఈ నెల 25 నుంచే అమలు

ఉన్నత పాఠశాలలు ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నడుస్తున్నాయి. అయితే పనివేళలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగించేలా ప్రభుత్వం నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన స్కూళ్లల్లో ఈ నెల 25 నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్కూళ్లల్లోనూ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో తీసుకున్న నిర్ణయాలపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. విద్యారంగంలో వింత పోకడలు అమలు చేస్తే ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఉన్నత పాఠశాలల బడి వేళలు మార్చాలనే నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అశాస్త్రీయ నిర్ణయం



ఉన్నత పాఠశాలల పని వేళల పొడిగింపు అశాస్త్రీయం. ఆచరణీయ సాధ్యం కానిది. పిల్లలు సంసిద్ధంగా ఉండరు. చాలామంది పిల్లలు 3 నుంచి 4 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలలకు వస్తుంటారు. ముఖ్యంగా అమ్మాయిలు వారి ఇంటికి చేరుకోవాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇళ్లకు చేరుకునేలోపు చీకటి పడుతుంది. ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. మహిళా ఉపాధ్యాయులు సైతం సాయంత్రం 5 గంటల తర్వాత వారి ఇళ్లకు వెళ్లడం శ్రమతో కూడుకున్నదే. ప్రస్తుతమున్న వేళలు కొనసాగించాలి.

– పి.అశోక్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు

ఆలోచన మంచిది కాదు



పాఠశాలల పని వేళల్లో మార్పు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి మంచిది కాదు. పల్లెల నుంచి ఉదయం 9 గంటలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 4 గంటలకు పాఠశాల వదిలివేస్తే 5 గంటల్లోపు ఇళ్లకు చేరుకుంటారు. అలా కాకుండా 5 గంటల వరకు పాఠశాలలోనే ఉంటే ఇళ్లకు వెళ్లడానికి సరైన సదుపాయం లేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. విద్యార్థులకు అసౌకర్యాన్ని కల్పించే పని వేళలో మార్పును ఒప్పుకోం.

– డెగావత్ రవీంద్రనాథ్, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి

తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు



ఉన్నత పాఠశాలల సమయాన్ని సాయంత్రం 5 గంటల వరకూ పెంచాలనే నిర్ణయం విద్యాశాఖ తిరోగమనానికి కారణమవుతుంది. ఉపాధ్యాయులను మానసికంగా వేధించాలనే అత్యుత్సాహం తప్ప బోధనలో నాణ్యతా ప్రమాణాలు ఎలా పెంపొందించాలనే ఆలోచన ఈ ప్రభుత్వం చేయపోవడం బాధాకరం. ఇప్పటికే వివిధ రకాల భారాలు మోపి వాటిని పూర్తి చేయాల్సిందేనంటూ అధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు.

– సిరాజుద్దీన్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

ఆలోచన సరైంది కాదు



ఉన్నత పాఠశాలల పని వేళలు పెంచాలనే ప్రభుత్వ ఆలోచన సరైంది కాదు. గతంలో ఉదయం 9:45 నుంచి సాయంత్రం 4:40 వరకు హై స్కూల్ పాఠశాలల పని వేళలు ఉండేవి. సుదూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థుల భద్రతను సమీక్షించి ఆ సమయాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు మార్పు చేశారు. గత ఐదేళ్లుగా ఇదే సమయాన్ని పాటిస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు పాఠశాల ముగిస్తే అక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే పిల్లలకు రవాణా సౌకర్యాలు ఇబ్బందికరంగా ఉంటాయి. చీకట్లో విద్యార్థినులకు భద్రత ప్రశ్నార్థకమవుతుంది.

– ఉదయగిరి మహమ్మద్ రఫీక్, ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శి

ప్రయోగాలు వద్దు



ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. ఇప్పటికే పాఠ్యాంశాల బోధనకు ఆటంకం కలిగిస్తున్న యాప్‌లను ముందుగా రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలి. పాఠశాలల పనివేళల మార్పు అనేది విద్యార్థుల విద్యపై సంసిద్ధత, స్థానిక పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, తల్లిదండ్రుల అనుమతిపై ఆధారపడి ఉంటుంది. మేధావులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల సలహాలు సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి. సాయంత్రం 5 గంటల తర్వాత 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం ఇళ్లకు వెళ్లే విద్యార్థుల భద్రతకు భరోసా లేదు.

– ఎస్.రమణారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

పిల్లలకు తీవ్ర ఇబ్బందులు



పాఠశాలల సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు మార్చడం వల్ల ఫీడింగ్ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. స్కూల్ ముగిసిన తర్వాత వారి గ్రామాలకు వెళ్లే లోపు చీకటి పడుతుంది. దీంతో విద్యార్థులు త్వరగా అలసిపోయి వారి మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మానసిక శాస్త్రవేత్తలూ హెచ్చరిస్తున్నారు. కాగా, సంఘాల నిర్ణయం కూడా తీసుకోకుండా మోడల్‌గా అని చెప్పి ఇంప్లిమెంట్ చేస్తారేమో అనే అనుమానాలు కూడా లేకపోలేదు. ఉపాధ్యాయులు, విద్యార్థుల మనోభావాలు, స్థానిక పరిస్థితులు తెలుసుకుని ముందుకు వెళితే బాగుంటుంది.

– ఎస్‌వీవీ రమణయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు, యూటీఎఫ్

క్లుప్తంగా

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం, ద్విచక్ర వాహనాలు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కంబదూరు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని కంబదూరు, అనంతపురం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం కుందుర్పి మండలం కొలిమిపాళ్యం చెక్‌పోస్టు వద్ద అనంతపురం ఎక్సైజ్ సీఐ లక్ష్మీసుహాసిని, కంబదూరు ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో కుందుర్పి మండలం జంబుగుంపలకు చెందిన శివన్న, కుందుర్పి గ్రామానికి చెందిన బసవరాజు ద్విచక్ర వాహనాల్లో కర్ణాటక మద్యాన్ని తీసుకోస్తూ పట్టుబడ్డారు. నిందితులను అరెస్ట్ చేసి, మద్యంతో పాటు వాహనాలను సీజ్ చేశారు.

చీటింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

గుత్తి: ప్రభుత్వ శాఖల్లో పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసం చేసిన ముగ్గురిని సోమవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు... కర్నూలుకు చెందిన మేరి సునీత, అన్నమయ్య జిల్లాకు చెందిన గుర్రం ప్రసాదరెడ్డి, షేక్ బాబ్జాన్ సాహెబ్... గుత్తికి చెందిన నిఖిల్‌తో పాటు మరి కొందరు నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.15 లక్షలు వసూలు చేసుకుని మోసం చేశారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ భారం ప్రతిపాదన ఉపసంహరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



మాట్లాడుతున్న వి.రాంభూపాల్

అనంతపురం అర్బన్: ట్రూ–అప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపనున్న విద్యుత్ భారాన్ని తక్షణం ఉపసంహరించాలని కూటమి సర్కార్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... 2023–24 ఆర్థిక సంవత్సరానికి ట్రూ– అప్ చార్జీల ప్రతిపాదనలపై అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలపాలని ఈ నెల 4న ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ నోటిఫికేషన్ జారీ చేసిందని గుర్తు చేశారు. ఈ మేరకు తమ అభ్యంతరాలను విద్యుత్ నియంత్రణ మండలికి పంపించినట్లు తెలిపారు. విద్యుత్ సంస్థలు చేసిన ప్రతిపాదనతో వినియోగదారులపై రూ.11,820 కోట్ల మేర భారం పడుతుందన్నారు. విద్యుత్ భారాలు వేయబోమని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీకి విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. తక్షణం విద్యుత్ కంపెనీలు చేసిన ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇక స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజల తరఫున అడ్డుకుంటామన్నారు.

23, 24 తేదీల్లో జిల్లా మహాసభలు

ప్రతి మూడేళ్లకు ఒకసారి జరిగే సీపీఎం మహాసభలు ఈ ఏడాది డిసెంబరు 23, 24 తేదీల్లో అనంతపురం వేదికగా నిర్వహించాలని కమిటీ నిర్ణయించినట్లు రాంభూపాల్ తెలిపారు. రానున్న మూడేళ్లలో చేపట్టాల్సిన కర్తవ్యాలను నిర్ణయించే అత్యున్నత వేదికగా మహాసభలు జరగనున్నాయన్నారు. రైతు, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న సీపీఎం మహాసభల జయప్రదానికి సహకరించాలని నగర ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు రామిరెడ్డి, రామాంజినేయులు, నాగమణి, నిర్మల, జగన్, అచ్యుత్, మల్లికార్జున, తరిమెల నాగరాజు, చంద్రశేఖరరెడ్డి, భాస్కర్, వెంకటనారాయణ, గోపాల్, ముత్తుజ, ఇర్ఫాన్, చంద్రిక, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్లలో అవినీతిపై విచారణ

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన కోడిగుడ్లు దారి మళ్లిన అంశంపై ఐసీడీఎస్ ఆర్జేడీ రోహిణి మంగళవారం విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్‌గా గంధం చంద్రుడు పనిచేస్తున్న సమయంలో కోడిగుడ్ల సరఫరాల అవినీతి చోటు చేసుకుందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై అప్పటి కలెక్టర్ గంధం చంద్రుడు ఆదేశాల మేరకు అప్పటి కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి విచారణాధికారిగా వ్యవహరించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీని ఆధారంగా పీడీ కార్యాలయంలో పనిచేసే ఇద్దరిపై సస్పెన్షన్ వేటు పడింది. అయితే అప్పట్లో ఏం జరిగిందనే అంశంపై ప్రస్తుతం ఆర్జేడీ విచారణ చేపట్టారు. ఆరోపణలు, నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అనంతరం నగరంలోని ఖాజానగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ లలిత, సూపర్‌వైజర్ విష్ణువర్ధిని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో నిందితుడి అరెస్ట్

పెద్దవడుగూరు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు తెలిపారు. స్థానిక పీఎస్‌లో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. నెల రోజులు క్రితం హరిజన రంగస్వామికి చెందిన పశువులు తన పొలంలో మేశాయంటూ పెద్దవడుగూరు మండలం భీమునిపల్లికి చెందిన చిన్నకేశవులు గొడవపడ్డాడు. అనంతరం ఈఈ నెల 14న కదరగుట్టపల్లి నుంచి భీమునిపల్లికి వెళుతున్న రంగస్వామిని మార్గమధ్యంలో చిన్నకేశవులు అడ్డుకుని కొట్టాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ అనంతరం చిన్నకేశవులును మంగళవారం అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు.

డీసీఈబీ కార్యదర్శిగా 'గంధం'



డీఈఓకు బొకే అందజేస్తున్న గంధం శ్రీనివాసులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో కీలకంగా ఉన్న జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) కార్యదర్శిగా కళ్యాణదుర్గం కేసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంధం శ్రీనివాసులు నియమితులయ్యారు. ప్రస్తుతం డీసీఈబీ కార్యదర్శిగా పనిచేస్తున్న పామిడి మండలం ఖాదర్‌పేట జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం పురుషోత్తం బాబు స్థానంలో గంధం శ్రీనివాసులును నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన డీఈఓను మర్యాదపూర్వకంగా కలసి బొకే అందజేసి, మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

రాప్తాడు రూరల్: జీవితంపై విరక్తితో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం నాగేపల్లికి చెందిన రమేష్ (32) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం వివాహమైన ఆయనకు భార్య వనిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కొందరి వద్ద అప్పులూ చేశాడు. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఆయన సోమవారం సాయంత్రం బళ్లారి రోడ్డులోని పవర్ డాబా సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కౌలు రైతులకు రుణసదుపాయం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం సెంట్రల్: గుర్తింపు కార్డు పొందిన కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పిస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. పంటల సాగుకు రుణాల అంశంపై అనంతపురంలోని కృషి భవన్‌లో మంగళవారం కౌలురైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 2024–25 రబీ సీజన్ నుంచి పత్తి రైతులు డిసెంబర్ 15లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ఏడీఏ రవి మాట్లాడుతూ.. ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని, క్రాప్ బుకింగ్ ఆధారంగా నష్టపరిహారం అందుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి కౌలు రైతులు కూడా అర్హులని తెలిపారు. ప్రధానమంత్రి సురక్షబీమా, ప్రధానమంతి జీవనజ్యోతి బీమా పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఏఓ శశికళ, విస్తరణాధికారులు మురళీకృష్ణ, అలేఖ్య, టెక్నికల్ ఏఓ సునీత, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీఆర్‌కు 15 మంది కానిస్టేబుళ్లు

అనంతపురం: జిల్లాలో మొత్తం 15 మంది కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ పి.జగదీష్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అసాంఘిక శక్తులతో సన్నిహితంగా ఉంటూ అక్రమ వసూళ్లకు తెరలేపారనే ఆరోపణలున్నాయి. వీఆర్‌కు వెళ్లిన వారిలో అనంతపురం వన్‌టౌన్ పీఎస్‌కు చెందిన పి.నరసింహులు, జి.అశోక్‌తో పాటు మనోహర్‌రెడ్డి (రాప్తాడు), జాన్సన్ (బీకేఎస్ హెచ్‌సీ), తాడిపత్రి రూరల్ పీఎస్ హెచ్‌సీ చాంద్‌బాషా, పీసీ ఆర్.ప్రసాద్‌నాయక్, తాడిపత్రి టౌన్ పీఎస్ పీసీ ఎ.పవన్ కుమార్, కుందుర్పి పీఎస్ పీసీలు ఎం.రెహమాన్, సురేష్‌బాబు, పెద్దపప్పూరు పీఎస్ హెచ్‌సీ అశోక్‌కుమార్, పీసీ ఆర్.శ్రీనివాసరెడ్డి, పెద్దవడుగూరు పీఎస్ హోంగార్డు లోకేశ్వరరెడ్డి, యాడికి పీఎస్ పీసీ కె.విజయ్‌కుమార్, కళ్యాణదుర్గం పీఎస్ ఏఎస్ఐ ఎ.రాజశేఖర్ ఉన్నారు.

యువ రైతు బలవన్మరణం

తాడిపత్రి రూరల్: మండలంలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రైతు రవి (25) ఆత్మహత్య చేసుకున్నాడు. తనకున్న ఐదు ఎకరాలతో పాటుమరో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని రవి పత్తి పంట సాగు చేశాడు. పంట సాగు కోసం చేసిన అప్పులు దాదాపు రూ.10లక్షలకు చేరుకున్నాయి. తెగుళ్లు, ఇతర కారణాలతో ఆశించిన స్థాయిలో పంట ఎదుగుల లేకుండా పోయింది. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు గమనించే లోపు ప్రాణాలు కోల్పోయాడు.

కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివ



హిందూపురం: వైఎస్సార్‌సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ కౌన్సిలర్ శివ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.



ఉదయం 6.25 గంటలకు అనంతపురం శివారులో పంట పొలాలపై కమ్ముకున్న పొగమంచు



తెల్లవారుజాము 4 గంటలకు 44వ జాతీయ రహదారిపై చలి కాచుకుంటున్న దృశ్యం

చలి.. పులి

జిల్లాపై చలి పులి పంజా విసురుతోంది. ఉదయం ఎనిమిది గంటలు దాటినా ప్రజలు బయటకు రావడానికి ధైర్యం చేయలేకపోతున్నారు. పొగమంచు పూర్తిగా కప్పేస్తోంది. దీనికి తోడు చల్లని గాలులు వీస్తుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. రాబోవు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీంతో పిల్లలు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





ఉదయం 7.45 గంటలకు చలి తీవ్రతకు ఒకదానికి మరొకటి హత్తుకుపోయిన గొర్రెలు, ముడుచుకున్న కొంగలు



ఉదయం 6.30 గంటలైనా అనంతపురంలోని టవర్ క్లాక్‌ను వీడని మంచుతెరలు

క్లుప్తంగా

విద్యార్థులకు 'ఆధార్' కష్టాలు



ఆత్మకూరులో ఆధార్‌లో మార్పుల కోసం వచ్చిన విద్యార్థులు

ఆత్మకూరు: విద్యార్థులకు ఆధార్ కష్టాలు తప్పడం లేదు. అపార్(ఆటోమెటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీలో నమోదు కోసం ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న విద్యార్థులు స్కూల్ రికార్డులకు అనుగుణంగా ఆధార్‌లో మార్పులు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. దీంతో ఆధార్‌లో మార్పుల కోసం విద్యార్థులు ఆధార్ నమోదు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆత్మకూరులోని ప్రభుత్వ కళాశాలలో ఆధార్ క్రేందాన్ని ఏర్పాటు చేసి మార్పులు చేయించేందుకు తేదీలను ప్రకటించారు. ఆయా తేదీల్లో ఉన్న గ్రామాల పాఠశాలలకు ఆధార్‌లో మార్పులు చేస్తున్నారు. కేంద్రంలో మరో కంప్యూటర్, మరో వ్యక్తిని ఏర్పాటు చేయిస్తే విద్యార్థులు ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సేవాభూషణ్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ఆల్ ది బెస్ట్ అకాడమీ వారు సంస్థ 19వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది 'సేవాభూషణ్' జాతీయ పురస్కారమందించనున్నారు. ఈ మేరకు మంగళవారం సంస్థ వ్యవస్థాపకులు ఈఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని రంగాల్లో ప్రతిభను కనబరుస్తూ సమాజంలో స్ఫూర్తినింపుతున్న వారు అవార్డులకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30 లోపు తమ దరఖాస్తులను 'ఆల్ ది బెస్ట్ అకాడమీ, డోర్‌నం. 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ -15' చిరునామ చేరేలా పంపాలని కోరారు. అవార్డుకు ఎంపికైన వారిని వచ్చేనెల 8న హైదరాబాద్‌లో జరిగే సభలో అవార్డులనందిస్తామని, వివరాలకు 9652347207 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు: అనంతపురంలో సోమవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్- 17 క్రికెట్ విభాగానికి జరిగిన సెలెక్షన్స్‌లో ఆత్మకూరు హోలీ స్పిరిట్ పాఠశాల విద్యార్థిని ఎస్.అక్షర ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విద్యార్థినిని ప్రిన్సిపాల్ శశిల్, కరస్పాండెంట్ అనూప, పీఈటీ శ్రీనివాసులు అభినందించారు.

సహకార వారోత్సవాలు



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: నగరంలోని అర్బన్ బ్యాంకులో మంగళవారం జాతీయ సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చైర్మన్ జేఎల్‌మురళీ, జిల్లా సహకార అధికారి అరుణకుమారి మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే సహకార వ్యవస్థ ఏర్పాటైందన్నారు. పంచవర్ష ప్రణాళికల ద్వారా అప్పటి ప్రధాని నెహ్రూ సహకార బ్యాంకుల బలోపేతానికి చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. అనంతరం క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ట్రైనర్ శ్రీనివాసులు, సహకార విద్యాశాఖ అధికారి మురళీధర్, బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, వైస్ చైర్మన్ వెంకటాద్రి, పాలవర్గసభ్యులు రమణయ్య, కృష్ణకుమార్, భాస్కర్, చింతా భాస్కర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా



అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాలిటెక్నిక్ విద్యార్థులు

అనంతపురం: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ అనంతపురంలో నిర్వహించిన యువ ఉత్సవ్-2024 పోటీల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(అనంతపురం) విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సైన్స్ మేళాలో ఈఈఈ విభాగం విద్యార్థులు మొదటి బహుమతిని, మెకానికల్ విభాగం విద్యార్థులు ద్వితీయ బహుమతి, ఆటో మొబైల్ విద్యార్థులు తృతీయ బహుమతిని గెలుపొందారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి విద్యార్థులను అభినందించారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్‌లో మరుగుదొడ్ల దుస్థితి



మరుగుదొడ్ల దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని వెళ్తున్న విద్యార్థి



బీసీ హాస్టల్ నంబర్ 1 హాస్టల్‌లో విరిగిపోయిన డోర్లు

సమస్యల మోత.. విద్యార్థుల వ్యథ

ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ఆయా వసతిగృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస సౌకర్యాలు కరువవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లు నిర్వహణ సరిగా లేక కంపుకొడుతున్నాయి. కిటికీలకు తలుపులు లేకపోవడంతో దోమల బెడదతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇక మరుగుదొడ్లకు డోర్లు ఊడిపోవడంతో వాటిని అడ్డంగా పెట్టుకుని కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టల్‌లో తలుపులు లేని కిటికీ



రాంనగర్ హాస్టల్‌లో సిబ్బంది కొరతతో వంట వండుతున్న వాచ్‌మెన్



నంబర్ వన్ హాస్టల్లో పడిపోతున్న పైకప్పు కిందే చదువుకుంటున్న విద్యార్థులు

చరిత్రకు ప్రతిబింబాలు నాణేలు

- జేసీ శివనారాయణ శర్మ



నాణేలను తిలకిస్తున్న జేసీ శివనారాయణ శర్మ తదితరులు

అనంతపురం కల్చరల్: నాణేలు మానవ చరిత్రకు ప్రతిబింబాలుగా నిలుస్తాయని జేసీ శివనారాయణశర్మ అన్నారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు ప్రాచీన, ఆధునిక నాణేల, పోస్టల్ స్టాంపుల ప్రదర్శన ఆసక్తిగా సాగింది. పర్యాటక శాఖ, పురావస్తుశాఖ సహకారంతో ఇంటాక్ (భారతీయ సంస్కృతి, వారసత్వ పరిరక్షణ సంస్థ) ఆధ్వర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్‌లో క్రీస్తు పూర్వం వెయ్యి ఏళ్ల కింద నాటి నుంచి నేటి వరకు మారుతున్న కరెన్సీ నోట్లు, నాణేలు, వివిధ సందర్భాల్లో భారత ప్రభుత్వం విడుదల చేసిన స్టాంపులను ప్రదర్శించారు. జేసీ శివనారాయణ, ఇంటాక్ కన్వీనర్ రాంకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చరిత్రపై అవగాహన పెంచడానికి పురాతన నాణేల ప్రదర్శన దోహదపడుతుందన్నారు. నాణేలను సేకరించిన భూపాలం గోవిందరాజుల గుప్తాను అభినందించారు. మ్యూజియం ఏడీ రజిత, ఇంటాక్ మాజీ కన్వీనర్ ఏజీ వేణుగోపాలరెడ్డి, వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖర రెడ్డి ఇంటాక్ కో-కన్వీనర్ కృష్ణమూర్తి, ప్రతినిధులు రియాజుద్దీన్, నబీరసూల్, ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు రామనాథం, గల్లా హర్ష పాల్గొన్నారు.

రైతు, కార్మిక సమస్యలపై ఐక్య ఉద్యమం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: రైతు, కార్మిక సమస్యలపై ఐక్య ఉద్యమం చేపట్టినట్లు సంఘాల నాయకులు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన మహాధర్నా జయప్రదానికి ఈనెల 20, 21వ తేదీల్లో జిల్లావ్యాప్తంగా జీపుజాతా నిర్వహిస్తామన్నారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. రైతులు, కార్మికులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు చేకూర్చేందుకు రైతులు, కార్మికులు, ప్రజలపై భారాలు వేస్తున్నాయని విమర్శించారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.14.65 లక్షలు కోట్లు మాఫీ చేసిందన్నారు. ఆత్మహత్య చేసుకుంటున్న అన్నదాతలకు ఒక్క రూపాయి మాఫీ చేయలేదన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తూ చలో కలెక్టరేట్ మహాధర్నా నిర్వహించనున్నామన్నారు. సీఐటీయూ, రైతు సంఘం,జిల్లా అధ్యక్షులు నాగమణి, తరిమెల నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటనారాయణ, అచ్యుత్ పాల్గొన్నారు.

కనుల పండువగా కోటి దీపోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: స్థానిక బెంగళూరు రోడ్డులోని శివబాలయోగి ఆశ్రమంలో మంగళవారం రాత్రి కోటి దీపోత్సవం కనుల పండువగా జరిగింది. ఆశ్రమంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహాశివలింగం వద్ద విశేష పూజలు, అభిషేకాలు, బిల్వార్చనలు, రుద్రం, చమకం పఠనం జరిగాయి. వందలాది జంటలు తమ ముందు ఏర్పాటు చేసుకున్న లింగాలకు పూజలు చేస్తూ దీపాలు వెలిగించడంతో ఆలయ పరిసరాలు శోభాయమానంగా మారాయి. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ నేతృత్వంలో తీర్థప్రసాదాల వితరణ జరిగింది.

డిసెంబరు 31లోగా పన్నులు చెల్లించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నగర ప్రజలు 2024-25 రెండో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రకాల పన్నులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా డిసెంబరు 31లోపు చెల్లించవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటిపన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి పన్నులు, అడ్వర్‌టైజ్‌మెంట్ పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వెంటనే చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గడువులోగా చెల్లించని వారి నీటి కొళాయి కనెక్షన్లు తొలిగించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్నులు చెల్లించేందుకు నగరపాలక సంస్థలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

అనంతపురం ఎడ్యుకేషన్: వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయి (స్త్రీ శక్తి దివస్) జయంతి వేడుకలను మంగళవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఇందులో భాగంగా నగరంలో విద్యార్థులతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి 1828 నవంబర్ 19న జన్మించారన్నారు. గుర్రపు స్వారీ, విలు విద్య, కత్తిసాములో ఆరితేరి వీరవనితగా కీర్తి గడించారన్నారు. చిన్న వయసులోనే భర్తను కోల్పోయినప్పటికీ దేశభక్తితో 1857లో జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. 'జోన్ ఆఫ్ ఆర్క్'గా

సంక్షిప్త సమాచారం

ఆమె భారత దేశ చరిత్రలో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు విజయ్, భూతరాజ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు..కక్కలపల్లికి చెందిన ఎర్రిస్వామి (43) అనే వ్యక్తి ఈ నెల 16వ తేదీ సాయంత్రం నడిమి వంక మీద టౌన్‌లోకి వస్తుండగా వెనుక నుంచి ఆటో ఢీకొంది. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. ఈమేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రిటైర్డ్ ఖాళీల్లో టీచర్లను సర్దుబాటు చేయాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి నెలా రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయుల స్థానాలను సర్దుబాటు ప్రక్రియతో భర్తీ చేసి పిల్లల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో టీచర్లు ఉద్యోగ విరమణ పొందితే అక్కడ పదో తరగతి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదముందన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, నాయకులు జి.సూర్యుడు, కె.సూర్యుడు, జి.కిషోర్, ఎ.అజయ్‌కుమార్, రామకృష్ణ ఉన్నారు.

పంపనూరులో కార్తీక పూజలు

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం కార్తీక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాలతో పాటు విశేష పూజలను చేపట్టారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. స్వామి వారి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

బాలికల సంరక్షణే ఐసీడీఎస్ ధ్యేయం



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ఐసీడీఎస్ ఆర్జేడీ రోహిణి, పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు

అనంతపురం సిటీ: లైంగిక వేధింపుల నుంచి బాలికలను రక్షించడమే తమ శాఖ ధ్యేయమని ఐసీడీఎస్ కర్నూలు ఆర్జేడీ రోహిణి అన్నారు. ప్రపంచ బాల బాలికలపై లైంగిక వేధింపుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురం రైల్వే స్టేషన్ ఎదుట మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బళ్లారినున్న శ్రీదేవి, అనంతపురం అర్బన్ సీడీపీఓ చల్లా లలిత, రూరల్ సీడీపీఓ ధనలక్ష్మి, నార్పల సీడీపీఓ భారతి, డీసీపీఓ మంజునాథ, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. బాలబాలికలు జాతీయ సంపదని, అటువంటి బాల బాలికలపై లైంగిక దాడులు పెరిగిపోతుండడంపై ఆర్జేడీ ఆందోళన వ్యక్తం చేశారు. బాలబాలికలను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఎస్ఐ మహమ్మద్ రఫీ, మహిళా ఎస్ఐ భారతి, ఏఎస్ఐ పద్మావతి, నలంద కళాశాల ప్రిన్సిపాల్ బాబు, ఐసీపీఎస్, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి అందిస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

అనంతపురం రూరల్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సోమలదొడ్డి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయికుమార్ దేశానికి మాజీ ప్రధాని చేసిన సేవలను కొనియాడారు. నాయకులు శివ, మురళీ, మంజునాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన అహుడా మాజీ చైర్మన్



అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్ తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

ముగిసిన సంతోష్ ట్రోఫీ

అనంతపురం: సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ లీగ్ దశ మంగళవారం ముగిసింది. అనంత క్రీడాగ్రామంలోని ఆర్డీటీ స్టేడియంలో ఈ నెల 15న ప్రారంభమైన మ్యాచ్‌ల్లో చివరి రోజు మంగళవారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు జట్ల మధ్య జరిగిన పోరులో తమిళనాడు జట్టు ఏకంగా 8-0 గోల్స్ తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది. మరో మ్యాచ్‌లో అండమాన్ నికోబార్ జట్టుపై 11-0 గోల్స్ తేడాతో కర్ణాటక జట్టు విజయం సాధించింది. ఓవరాల్‌గా అత్యధిక పాయింట్లతో తమిళనాడు జట్టు ఫైనల్‌కు చేరింది. జేవీ అనిల్‌కుమార్, డాక్టర్ సుప్రజ, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డానియల్ ప్రదీప్ పాల్గొని మ్యాచ్‌లను వీక్షించారు.

విద్యార్థినులు ఆరోగ్యం కాపాడుకోవాలి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థినులు ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ ప్రసూన సూచించారు. మంగళవారం స్థానిక కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అమ్మాయిలు ఆరోగ్యపరంగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. మంచి ఆహారం ఎప్పటికప్పుడు తీసుకోవాలని, బయట తిండికి అలవాటు పడొద్దని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత మాట్లాడుతూ నేటి జీవన ప్రమాణాల్లో కాలానికి అనుగుణంగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.మహిళా సాధికారత విభాగం మేరీ మాధురి, అధ్యాపకులు డాక్టర్ సి. రామాంజనేయులు, అంజనరెడ్డి, సౌగంధిక, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అనుమతి లేని ఎరువులు, మందులు అమ్మొద్దు

ఆత్మకూరు: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో అనుమతి లేకుండా మందులు, ఎరువులు అమ్మితే చర్యలు తప్పవని ఏడీఏ లక్ష్మానాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఏఓ సుచరితతో కలిసి ఆత్మకూరులో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రెండు దుకాణాల్లో అనుమతి లేని ఎరువుల(రూ.లక్ష విలువ) అమ్మకాన్ని నిలుపుదల చేస్తూ ఉత్తర్వులిచ్చినట్లు ఏడీఏ తెలిపారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు.

పీఏబీఆర్ కుడికాలువకు నీరు విడుదల చేయాలి



కాలువను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రాప్తాడు: పీఏబీఆర్ కుడికాలువ మరమ్మతులు చేపట్టి నీటిని విడుదల చేయాలని సీపీఎం రాప్తాడు మండల ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. డిసెంబర్ 1 నుంచి పీఏబీఆర్ కుడికాలువకు నీటిని విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ఎస్ఈ ప్రకటించడంతో మంగళవారం మండలంలోని పీఏబీఆర్ కుడికాలువను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏబీఆర్ కుడికాలువకు నీళ్లు వదులుతామని పత్రికల్లో ప్రకటించారని, కుడి కాలువలో కంపచెట్లు అధికంగా పెరిగాయని, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. వెంటనే పీఏబీఆర్ కుడికాలువ, కాలువ గట్టుపైన కంప చెట్లు తొలగించాలన్నారు. పీఏబీఆర్ కుడికాలువ మరమ్మతులు చేపట్టి 49 చెరువులకు నీటిని అందించాలన్నారు. సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యుడు పోతులయ్య, రైతులు వెంకట్రావు, ఆదినారాయణ రెడ్డి, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ పురోగతి



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, తదితరులు

అనంతపురం: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జేఎన్‌టీయూఏ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వికసిత్ భారత్-2047 కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ హెచ్. సుదర్శనరావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కె.మణికంఠ, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాతి భరత్, కార్యక్రమ అధికారి జి.శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాతి జీవన్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, యువత సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రబీ పంటలకు బీమా చేయించుకోండి

ఆత్మకూరు: రబీ పంటలైన మామిడి, టమాట, పప్పుశనగ, వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర పంటలకు రైతులు బీమా చేయించుకోవాలని ఏఓ సుచరిత తెలియజేశారు. మంగళవారం పంపనూరు, ముట్టాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీ పంటలకు సంబంధించి బీమా కోసం డిసెంబర్ 15 వరకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. ఆర్‌ఏడీ స్కీమ్ ద్వారా ఎఫ్‌పీఓ(రైతు ఉత్పత్తి సంఘం)కు అమలవుతున్న పథకాలను వివరించారు. ఏఓ విజయ్‌కుమార్, ఏఈఓ సుజిత, అగ్రికల్చర్ హెచ్ఈఓ శ్రీనివాసులు, ఇన్సూరెన్స్ ఎఫ్‌సీఓ కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ నేత శకుంతలమ్మ మృతి



అనంతపురం అర్బన్: సీపీఐ సీనియర్ నేత శకుంతలమ్మ అనారోగ్యంతో మంగళవారం మరణించారు. ఆమె మృతికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, మహిళ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి ఇతర నాయకులు తీవ్ర సంతాపం తెలియజేశారు. పార్టీకి సేవలందిస్తూ ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేసిన ఆమె మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆమె పార్థివ దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించనున్నట్లు ఆమె కుమారుడు రాజేశ్ తెలియజేసినట్లు జాఫర్ తెలిపారు. ఇదిలా ఉండగా శకుంతలమ్మ మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, ఇతర నాయకులు సంతాపం తెలియజేశారు.

రగ్బీలో మెలకువలు నేర్పించాలి



రగ్బీలో మెలకువలు నేర్పుతున్న తమిళనాడు కోచ్ నోయల్ ఎడ్వర్డ్

రాప్తాడు: క్రీడాకారులకు రగ్బీ క్రీడలో మెలకువలు నేర్పించాలని తమిళనాడు కోచ్ నోయల్ ఎడ్వర్డ్, అనంతపురం జిల్లా రగ్బీ సంఘం సభ్యుడు శంకర్ పీఈటీలకు సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు మండలాలకు సంబంధించిన పీఈటీలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన పీఈటీ రమేష్, ఆయన కుమారై సాయి భవిత ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ రగ్బీ క్రీడకు అధిక ప్రాధాన్యత పెరుగుతోందని, ప్రతి పాఠశాలలో రగ్బీ క్రీడను ప్రారంభించాలన్నారు. ఈసందర్భంగా క్రీడ సంబంధించిన మెలకువలు, నియమాలను వివరించారు. ఎంఈఓ మల్లికార్జున, హెచ్ఎం సాంబశివుడు, స్కూల్ కాంప్లెక్స్ కోఆర్డినేటర్లు ఎన్.కేశవమూర్తి, బి.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.